# ధర్మసూక్ష్మం

నిజానికి వడ్లగింజలోది బియ్యపుగింజ! అసలు - ధర్మమనే పదార్థమే అలా అతి సూక్ష్మంగా ఉంటుందేమో! అందరూ నిత్యకృత్యంగా భావించే దానిలోనించే ఒక్కొక్క మహాపురుషుడికి ఒక్కొక్క ధర్మరహస్యం చిత్రంగా స్ఫురిస్తూ ఉంటుంది. ఉప్పు సత్యాగ్రహం సంగతి చూడండి—గాంధీ మహాత్ముడు దండిసత్యాగ్రహానికి నడుం కట్టి బయలుదేరే వరకూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని హడలుకొట్టగల మహత్తరమైన శక్తి కానీఅయినా ఖరీదు చెయ్యని చిట్టెడు ఉప్పు తయారు చెయ్యటంలో ఇమిడి ఉందని ఎవ్వరైనా ఊహించారూ?

అసలు జరిగిన సంగతి :

రోజూలాగ అయిదుగంటలకు ఆఫీసు విడవగానే 13 వ నంబరు బస్సులో కూలబడి కొంపచేరుకుంటే ఏ రొష్టూ లేక పోయేది! కాని, జీతండబ్బులు చేతిలో పడ్డరోజవటం మూలాన ఆడవాళ్ళకి పువ్వులూ, పిల్లలకు బిస్కట్లూ గట్రా కొనుక్కుపోదామనే సరదా పుట్టి, అవాళ చైనా బజారు వెళ్ళాను. అక్కడ అవీ ఇవీ కొనుక్కోటానికైనా సేపెంతో పట్టలేదు. మళ్ళీ ఆరు గంటలయ్యేసరికి హైకోర్టు దగ్గిర బస్ టెర్మినస్‌కి వచ్చేసి, మైలపూరు బస్సులో సీటు సంపాదించాను. కాని, ఆరుగంటలకు బస్సులో ఎక్కినవాణ్ణి రాయపేటలో కొంప చేరుకునేసరికి తొమ్మిది గంటలు ఠంగున కొటారు. త్రోవలో చెడిపోవటం గాని, కారుక్రింద ఎవరైనా పడటంవంటి సంఘటన గాని ఏదీ జరుగకపోయినా, ఆ గవర్న్మెంటు ట్రాన్స్‌పోర్టు బస్సు ఆ రోజున హైకోర్టు దగ్గిర బయలుదేరిన మూడు గంటలకుగాని రాయపేట చేరుకోలేకపోయింది.

బస్సు చైనాబజారు స్టాప్ దగ్గిరికి వచ్చి నిలిచీ నిలవగానే 15, 20 మంది ఒక్కసారిగా జుమ్మనుంటూ తేనెటీగల్లాగ బస్సు మీదికి ఎగబడ్డారు. బస్సు వెనుక గేట్ దగ్గిర కండక్టరు నుంచుని 'ఎట్టుపేర్ ఏరుంగో' (ఎనమండుగురు ఎక్కండి) అంటూ ఒక్కొక్కళ్ళే లోపలికి విడుస్తూ ఒణ్ణు, రెణ్ణు, మూణు అని లెక్కపెట్టుకుంటున్నాడు. ఇంతలో మధ్య వయస్సులో ఉన్న ఒక లలనారత్నం ఒక కన్నెపడుచును వెంటబెట్టుకుని ముందు గేట్లోనుంచి చరచరా బస్సులోకి ఎక్కేసింది. బస్సు డ్రైవరు "ఇంగె ఏరాదమ్మా—పిన్నాలే పో అమ్మా" అని అరుస్తున్నా ఆమె లక్ష్యం చెయ్యలేదు. బస్సులో ఎక్కగానే ఇద్దరు నవనాగరిక యువక విద్యార్థులు తమ సీట్లు ఖాళీచేసి, అతిమర్యాదగా ఆ అబలాద్వయానికి ఆసనదానం చేశారు. కండక్టరు తన లెక్క ప్రకారం ఎనిమిదిమందీ ఎక్కగానే వెనకవాళ్ళని "ఎరంగిడు అప్పా!—ఎడమిల్లై అప్పా! పిన్నాలే బస్సువరది" అంటూ బలవంతాన ఫుట్ బోర్డుమీదనుంచి దించేసి "రైట్పా! పో అప్పా!" అని ఈల వేశాడు.

కాని, అప్పటికే డ్రైవరు తన సీటులోనుంచి దిగివచ్చి ఆ స్త్రీలను దిగిపొమ్మని జబర్దస్తీ చేస్తున్నాడు. ముందుగేట్లోనుంచి ఎక్కటం రూలుకి వ్యతిరేకమనీ, ఎక్కేవాళ్ళందరూ వెనుకగేటునుంచే ఎక్కాలనీ, ముందుగేటు దిగేవాళ్ళకోసమేననీ చెప్పి ఎలాగైనా వాళ్ళని దించెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. డ్రైవరు అరవం కొంతకి కొంతయినా అర్థమయిందిగాని, ఆ అబలారత్నం చెప్పిన జవాబుమాత్రం స్పష్టంగా నాకు అర్థం కాలేదు. అయితే ఆమె జవాబులోని తీవ్రతని చూసి—"నువ్వు అరిచి గీపెట్టుకున్నా నేను దిగేది లేదు. నువు చేసేదేవిటో చేసుకో!" అని అంటున్నదేమో అని ఊహించాను. ధర్మం కోసం తుదిదాకా పోరాడి తీరాలిసిందే ననుకున్నాడో ఏమో డ్రైవరుకూడా ఏమీ తగ్గలేదు. ఆ స్త్రీలిద్దరూ దిగిపోతేనే తప్ప తాను కారు తోలేది లేదని కరాఖండితంగా చెప్పేశాడు.

కండక్టరుకూడా వచ్చి వాళ్ళను దిగిపొమ్మని ఆజ్ఞాపించాడు. ఓవర్‌లోడ్ అయితే తనకు జుల్మానా పడుతుందని మొరపెట్టుకున్నాడు. ఒకరిద్దరు ప్యాసెంజర్లుకూడా కలిపించుకుని, ధర్మసూక్ష్మాన్ని ఆమెకు విడమర్చి చెప్పటానికి ప్రయత్నించారు. ముఖ్యంగా ఆ స్త్రీలకు ప్రక్కసీటులోనే ఆసీనులై ఉన్న స్థూలకాయుడైన ఒక బడా సాహుకారూ, లాయరుపనిచేస్తున్న ఒక అయ్యంగారూ ఆమెతో గట్టిగా వాదించారు. "గవర్న్మెంటు రూలుని వ్యతిరేకించటం గొప్ప పాపమమ్మా!" అని సాహుకారు హితబోధ చేశాడు. "ఏ స్వతంత్ర దేశంలోను ఇలాంటి అనాగరిక సంఘటన జరుగదు. పేరుకి మన దేశానికి స్వతంత్రత వచ్చిందేగాని, మన మనస్సుల్లోమాత్రం ఏమీ మార్పు రాలేదు. ఇంతమంది ప్యాసెంజర్ల పనులు పాడుచేస్తూ బస్సు కదలకుండా చేశాననే బాధఅయినా లేదు చూడండి – ఆమెకు!" అన్నాడు న్యాయవాది. నామట్టుకు నేను కూడా – పైకి ఎటూ కలిపించుకుని మాట్లాడకపోయినా –

---

"ఏమండీ. మీరు ఈ మధ్య మీ పుస్తకాలన్నీ అచ్చు వేయించినట్టున్నారు. ఏ మాత్రం అమ్ముడుపోయాయి?"

"పుస్తకాలమ్ముడు పోలేదు గాని, ఆస్తంతా అమ్ముడుపోయింది."

* * *

నౌకరు:— సార్, సార్ ఈ కుర్చీలో కూర్చోకండి. దీన్నిండా నల్లులున్నాయి.

యజమాని :— ఈ నల్లుల కుర్చీ ఇక్కడ వెయ్యకపోతే విజిటర్స్ రూములో వెయ్యరాదురా. వాళ్ళ పీడా వదుల్తుంది.

---

## శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

ఆ డ్రైవరు ధర్మబుద్ధికి మనస్సులో చాలా ఆనందించాను. అలా ఎవరో ఒకరు పూనుకోకపోతే స్వతంత్ర భారతదేశంలో ఉత్తమ సంప్రదాయాలు ఏర్పడటం కల్ల అనుకున్నాను.

కాని, క్రమంగా ఆ స్త్రీరత్నంకూడా తన వాదాన్ని బలపరిచేవారిని బస్సు ప్రయాణీకులలో కొంతమందిని సంపాదించుకో గలగటం నాకు ఆశ్చర్యమే వేసింది. ఇంచుమించుగా బస్సులోనివారందరూ రెండు పక్షాలుగా చీలిపోయి, రణగొణ ధ్వనిచేస్తూ వాదోపవాదాలకు దిగారు. క్రమంగా కాలం గడుస్తున్న కొద్దీ ఆ మధ్య వయస్సు లలనా రత్నం ఎంత అసాధ్యురాలో నా కర్థమైంది. ఆమెకు తెలుగు, ఇంగ్లీషు కూడా వచ్చు. ఆమెను విమర్శించేవారి కందరికీ అన్ని రకాలుగాను, అంత గట్టిగాను ఆమె సమాధానాలు చెబుతున్నది. కేశబంధనపు వైఖరీ, రిస్టువాచీ, కళ్లజోడూ, హాండు–



డ్రైవరు తన సీటులోనుంచి దిగివచ్చి ఆ స్త్రీలను దిగిపొమ్మని జబర్దస్తీ చేస్తున్నాడు.

# ధర్మ సూక్ష్మం

బాగా వగైరా వేషమంతా చూస్తే ఆమె ఏదైనా పెద్ద ఉద్యోగస్తురాలేమో అనిపించింది.

ఆమె వాదం సారాంశం సంగ్రహంగా ఇది :

తాను గంటసేపటినుంచీ అక్కడ నిరీక్షిస్తూంది. ఎన్ని బస్సులు వచ్చినా మొగ వాళ్లు తోసుకుని వచ్చి ముందు ఎక్కేస్తూ ఉండటం, తీరా తను ఎక్కబోయేసరికి కండక్టరు "ఎడమిల్లె" అని తుంటెచెయ్యి చూపిస్తూ ఉండటం జరిగింది. ఆ పరిస్థితులలో గత్యంతరం లేక ఈసారి ఆమె ముందుగేట్లోనుంచి ఎక్కేసింది. ఎందరు ఎన్నివిధాల గింజుకున్నా తాను మాత్రం బస్సులోనుంచి దిగదలుచుకోలేదు.

ఆ స్త్రీలవాదమంటే సానుభూతి ఏర్పడిన నా ప్రక్క ఆసామీ నా జబ్బ పుచ్చుకుని కదుపుతూ "మాట్లాడవేమిసార్! మగవాళ్ళని తోసుకుంటూ వెనక గేటులోనుంచి ఆడకూతురు ఎలా బస్సు ఎక్కుతుంది చెప్పసార్ !" అన్నాడు. నాకూ ఒక సందేహం కలిగింది—"బస్సులలో స్త్రీలకు అతి మర్యాదగా ఆసనదానాలు చేసే ఈ నాగరిక యువకులు బస్సుస్టాపుల దగ్గరకూడా అదే నాగరికతను ప్రదర్శించి ముందు స్త్రీలను ఎక్కనిచ్చి, ఆవెనుక ఎడం ఉంటేనే తాము ఎందుకు ఎక్కకూడదా!" అని.

ఈ రభస ఆరంభమై అప్పటికి దాదాపు రెండు గంటలు కావస్తూంది. చైనాబజారు రంగురంగుల విద్యుద్దీపాలతో, వివిధ వీధి వర్తకులఆరావాలతో, సీతాకోకచిలుకల్లాగ మస్తాబై షాపింగ్‌కి బయలుదేరిన పలు తరహాల అంగనాజనంతో అతి దర్శనీయంగా ఉంది. బస్సులూ, చిన్నకార్లూ అనేకం వస్తున్నవి, పోతున్నవి. కాని, మా బస్సు మాత్రం కదిలే సూచన ఎక్కడా కనిపించటం లేదు. మొదట ఉత్సాహంతో వాదోపవాదాల్లోకి దిగిన చాలామంది ప్రయాణీకులలో క్రమంగా విసుగుదల ఆరంభమై, బస్సు బయలుదేరదియ్యమని కండక్టరుని ఒత్తిడి చెయ్యటం మొదలుపెట్టారు. కాని, అటు డ్రైవరు గాని, ఇటు ఈ స్త్రీ గాని ఎవరూ తమ తమ ప్రతిజ్ఞలను లవలేశమైనా సడలించటానికి ఒప్పుకోటం లేదు.

ఆ విషమ సమస్యను పరిష్కరించేందుకు ఒక ఉపాయం నాకు తోచింది. మెల్లగా పక్క ఆసామీతో అన్నాను:


గొప్ప దీపావళి కానుక

టెలిగ్రాం: PARIVARTAN రు. 60,325 రిజిష్టర్డు నెం. 5025

అన్నీ సరియైన 19 బహుమతులకు పంచిపెట్టబడును.

అన్ని బహుమతులు గ్యారంటీ చేయబడినవి

| | | |
|---|---|---|
| అంతా సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. | 3175 లు |
| మొదటి రెండు వరసలు సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. | 1105 లు |
| మొదటి ఒకవరస సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. | 81 లు |
| a, b or a, c సరిగానున్న ప్రతి ఆన్సరుకు | రు. | 20 లు |

| | | | |
|---|---|---|---|
| a | b | | |
| c | | | |
| | | | |
| | | | |

ఇచ్చట చూపిన చదరంలో 4 నుండి 19 వరకు అంకెలు వాడి నిలువుగగాని, అడ్డముగగాని, అయిమూలలుగా గాని ఎటు కూడినను మొత్తం 46 వచ్చునట్లు చేయవలెను. ఒకసంఖ్య ఒకసారే వాడవలెను.

ఆఖరు పోస్టింగు తేది 16-10-52. ఫలితము 27-10-52

ప్రవేశరుసుము: ఒక ఎంట్రి రు. 1/-;

4 ఎంట్రీలు రు. 3/-లు, 8 ఎంట్రీల ప్రతిసెట్టు రు. 5/-లు

గతపోటీ ఫలితం

| | | | |
|---|---|---|---|
| 8 | 7 | 18 | 17 |
| 10 | 20 | 5 | 15 |
| 13 | 9 | 16 | 12 |
| 19 | 14 | 11 | 6 |

మొత్తం 50

రూల్సు: పై రేటువంతున రుసుముతో సాదాకాగితం మీద ఎన్ని ఎంట్రీలైనను పంపవచ్చును. రుసుము మనియార్డరు ద్వారాగాని పోస్టల్ ఆర్డరు ద్వారాగాని, బ్యాంకుడ్రాఫ్టు ద్వారాగాని పంపవలెను. ఎంట్రీలు రిజిష్టరు కవరులో పంపితే మంచిది. ఢిల్లీలో ఒక పెద్ద బ్యాంకులో డిపాజిటు చేసిన సీల్డుసొల్యూషనుతో, లేక దానివరుసలతో సరిపోలియుండు సొల్యూషను లేక వరుసలు మాత్రమే సరియైనవిగా ఎంచబడును. సొల్యూషనులో ఇంగ్లీషు అంకెలు మాత్రమే వాడండి. పై బహుమతి మొత్తము రు. 60,325/-లు మాకు చేరిన అంతా సరైన సొల్యూషనుల సంఖ్యను బట్టి మారును, కాని గ్యారంటి చేయబడిన బహుమతులు మారవు. ఫలితములకుగాను ఎంట్రీలతో స్వంత అడ్రసు వ్రాసి టిక్కెట్టు అంటించిన కవరు పంపవలెను. మానేజరు తీర్పు ఖాయముగాను లా ప్రకారము బద్ధమైనదిగాను వుండును. మీ ఎంట్రీలు రుసుములు దిగువ అడ్రెసుకు పంపండి.

**Maya Distributors(43)Regd, 558, Chandni Chowk, P. B. 73A. Delhi**

రు. 1-14-0 లు మాత్రమే పెట్టుబడి పెట్టి
రు. 1024/-లు సంపాదించండి

వివరములకు వ్రాయండి.

ఇండియన్ నేషనల్ పాలిసీ కంపెనీ
(Money Circulating Scheme)

పో. బా. నం. 889 జి. పి. ఒ. కలకత్తా 1,

స్థాపితము — 1935

ఇండియాలో ఇటువంటి కంపెనీలలో ఇదే మొదటిది. స్థాపింపబడినప్పటినుండీ ఈ కంపెనీ ఎక్కువపేరు ప్రఖ్యాతులతో ప్రజలకు సేవ చేయుచున్నది.

# ధర్మసూక్ష్మం

"పోనీ—ఆ ఇద్దరు స్త్రీలూ ముందుగేట్లో నుంచి దిగిపోయి..."

"అది ఒక్కనాటికి కుదరదు సార్!"

"...చివరిదాకా విను! మళ్లీ వెనక గేట్లోనుంచి ఎక్కటం"

"డ్రైవరూ, కండక్టరూ ఒప్పుకుంటే నాకు ఇష్టమే సార్! ఈపద్ధతి" అన్నాడు నా ప్రక్క ఆసామి.

"అప్పుడే అవలేదు—విను! మరి ఓవర్ లోడ్ సమస్య ఒకటి ఉందిగదా! అందుకని 'ఈ స్టాప్‌లో ఎక్కిన ఇద్దరు ప్యాసెంజర్లు దిగిపోవాలి!"

"నీవు వట్టి పిచ్చి వాడు దా సార్! ఎక్కినప్యాసెంజర్లు ఎవళ్లో దిగమంటే ఎవరు దిగుతాడుసార్?"

ఇంతలో - డ్రైవరూ, కండక్టరూ దూరంగా పోయి ఏమి మాట్లాడుకుని వచ్చారో ఏమో - డ్రైవరు బస్సు స్టార్టు చేశాడు. 'అమ్మయ్య!' అని బస్సులో ప్రయాణీకులందరూ నిట్టూర్పు విడిచారు. అంతవరకూ తెగ ఉక్కిపోయి ఉన్న ప్రాణాలు బస్సుకదలగానే చల్లని గాలి పోసుకొని కొంచెం తేరుకున్నవి.

నిజానికి - అక్కడితో కథ ముగిసిపోవలసిందే! కాని, ఆ డ్రైవరు పట్టుదలలో భగీరథుడిలాంటివాడు. అంతతో పోనియ్యకుండా బస్సుని మౌంట్‌రోడ్‌లో గవర్నమెంట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు ఆవరణలోకి పోనిచ్చాడు. అక్కడా మళ్ళీ అరగంట! మళ్ళీ అదే భాగవతం! అక్కడి ఉద్యోగస్థులు వచ్చి ఆమెను దిగమనటం, ఆమె ససేమిరా దిగనని భీష్మించటం. ప్రయాణీకుల ఒత్తిడి ఎక్కువ కావటం మూలాన పాపం - చివరికి డ్రైవరే ఓటమి ఒప్పుకోవలసి వచ్చింది.

మళ్ళీ బస్సు బయల్దేరినతర్వాత - "డబ్బులిచ్చి టిక్కెట్టైనా తీసుకుంటావమ్మా? అదీలేదా?" అన్నాడు కండక్టరు వెటకారంగా. అమితకోపంతోను, అతి నిర్లక్ష్యంతోను ఆమె చేతిసంచిలోనుంచి డబ్బులుతీసి తమ రెండు టిక్కెట్లకూ మూడణాలు కండక్టరు చేతిలోకి గిరాటువేసి, ఆ కన్నెపడుచుతో సహా పి. ఆర్. అండ్ సన్స్ స్టాప్ దగ్గిర దిగి వెళ్లిపోయింది.

'డ్రైవరు వాదనా, లేక ఆ స్త్రీరత్నం వాదనా - రెంటిలో ఏది నిజంగా సక్రమమైనది?' అన్న ధర్మసూక్ష్మం మాత్రం ఆనాటికీ, ఈనాటికీ నాకు తేలనేలేదు.

★

---

మంత్రిగారు ఉపన్యాసం ప్రారంభిస్తూ "మహాజనులారా! క్షమించాలి. ఇవ్వాళ నాగొంతిక పూడిపోయింది. ఉపన్యాసం ఇచ్చే ఓపికలేదు, రేపెల్లాగూ అది పేపర్లో పడుతుంది గనక మీరది చదువుకోవచ్చు. ఇంతటితో విరమిస్తున్నాను."

---

# ఒకటో తారీఖు

(19-వ పేజీ తరువాయి)

విశ్వం గారికి. { మద్రాసు 22-7-52

నమస్కృతులు.

మొన్న ట్రాంలో మీ మనీపర్సు కొట్టివేసింది నేనే. ఆ పర్సును ఇంటికి తెచ్చాక విప్పిచూస్తే అందులోపదిన్నరణా మాత్రమే వుంది. అప్పటికి కానీ మీరు నాకన్నా దరిద్రులన్న సంగతి తెలియలేదు నాకు. తోటి బీదవాని పర్సును దొంగిలించటం నాకు మనస్కరించనందున, ఇందుతో మీ మనీపర్సును పంపిస్తున్నాను. దైవవశాత్తు అందులో మీ విలాసం వున్నందువల్ల పంపించగలిగాను కానీ, లేకపోతే నామనస్సు చివుక్కుమనేది. మీ ట్రాంపాస్ కూడా పంపించాను. చూసుకోండి. ఈవిషయంలో మీకే మాత్రం శ్రమ కల్గించినా క్షంతవ్యుణ్ణి. దారిలో మీ రెక్కడైనా కనిపిస్తే, దూరంనించి ఒక్క నమస్కారం విసిరివేసి, నా మనస్సుకు శాంతి కల్గించుకుంటాను.

ఇంతే...శెలవు...

ఇట్లు
మీ మిత్రుడు
పాంప్యెక్.

పార్సెల్‌మీద స్టాంపులు చూశాను. సరిగ్గా పదిన్నరణాల స్టాంపులు అంటించబడి ఉన్నాయి. ఆ దొంగ పెద్దమనిషి ఎక్కడెదుఖంగా ఉన్నాడో ఏమో కానీ, ఇక్కణ్ణించే మనస్ఫూర్తిగా నమస్కరించాడుకున విశ్వం. ★


ఆరోగ్యానికీ, సౌందర్యానికీ
## కాసినో టాల్కం పౌడరు
ఉపయోగించండి.

ఇది బిడ్డలకు చల్లదనము, హాయినిస్తుంది. మనోహరమైన పరిమళము గలది. చర్మ వ్యాధులను నివారిస్తుంది.







## హిందీ విద్యాబోధిని

తెలుగక్షరములు తెలిసిన ప్రతివారు ఈ గ్రంథసహాయంవల్ల ఒక నెలలోనే హిందీ భాషను నేర్చుకొనవచ్చును. ఉచ్చారణ,అర్థ వివరణములు తెలుగక్షరములతో యీయబడినవి. హిందీ నేర్చుకొనువారికి ఇది చాల సహాయకారి. వెల 1-4-0తపాలాఖర్చు వేరు.

ఈశ్వరి కో,
పోస్టుబాక్సు, 189, మదరాసు-1